## ఋణప్రదాయకుం



ఉదయం ఏడింటికల్లా శివాలయం దగ్గర విరహగీతాలూ ఆ — ఋణగీతాలూ పాడుతూ కూర్చుంటానని, అతన్ని అప్పడిగిన స్నేహితుడు క్రితంరాత్రి బెదిరించాడు. దానికితోడు గుర్నాధం అతనితో మాట్లాడుతూ ఉండగా, ఒక మొహమాటస్థుడికి పాతిక రూపాయలు సర్దాల్సివచ్చేవరకూ ఆ స్నేహితుడే ఇతనికి అమాంతం ఆ పాతికా ఇచ్చాడు. పెద్దమనిషిని పంపేశాక, గుర్నాధం తీరుబాటుగా ఆశ్చర్య

పడి లేచి, బ్రదర్ నీ దగ్గర డబ్బుండగా నన్నెందుకు అప్పడుగు తున్నావూ అని అడిగాడు. స్నేహితుడు ఋణతరుణహాసం చేసి, ఆ దీన్దే వుందిలే, నీకోసం రెండు సాయంకాలాలు ఇక్కడ పడిగాపులు పడి ఉండగా, ఉబుసుపోక దారేపోయే వాళ్ళని పలకరిస్తూ ఉంటే దానంతటదే జమ పడిందిలే అన్నాడు. ఏ విద్య అయినా—ముఖ్యంగా ఋణగ్రహణ విద్య, సాధనచేస్తూ ఉంటేనేతప్ప పనిచెయ్యదని ఉపదేశించాడు. అయినా మన సొమ్మేంపోయె. తెలిసినవాడు మన వాతపడితే ఓమాటు కులాసా ? అని చూసేది. ఔనంటే అయిదో పదో అర్ధో పావలో అడిగి జేబులో వేసుకునేది. కాదంటే అదేపాయె. ఇంకోసారి దొరుకుతాడు. కాకపోయినా అప్పేగదా. మళ్ళీ ఎప్పుడో అప్పుడు వాడి డబ్బు వాడి మొహాన యెలాగా విస్సిరి కొట్టేదేనాయె. ఇంతకీ తీరిక వేళలో అలా రెండూ మూడూ అయిదూ పదీ రదేసి పుచ్చుకోమట్టేగదా ఈ క్షణాన గుర్నాధం పరువు శివాలయం దగ్గర నిలబడింది. ఆపాటి గుర్నాధం దగ్గరలేకనా, ఒక్కడుగు ఇంటికెళ్తే కొల్లలు ఇనప్పెట్లో. అయితేనేం ఆ ఒక్కడుగూ వేసేలోగానే పరువులు పోవచ్చు, కొంపలు కూలిపోవచ్చు, కులగిరులు తలకిందులై పోవచ్చు. ముష్టి పాతిక రూపాయలకోసం పరువులూ, కొంపలూ, కుల గిరులూ పోయి, కూలిపోయి, తలకిందులై పోవడం సబబేనా. వాటివల్ల రైళ్ళ రాకపోకలు దెబ్బతింటాయి దానివల్ల మెడ్రాసులో, వైజాగులో చదువుతున్న వాళ్ళకి మనియార్డర్లు సకాలంలో చేరవు. దానివల్ల సరోజలూ, భానుమతులూ, సీతలూ, కాలేజీలకూ, హైస్కూళ్ళకీ వెళ్ళివచ్చేవేళ గుర్నా ధాలు సందు మొగల్లో బస్టాండు దగ్గరా బీటుకాయడం వీలుపడదు. దాని వల్ల సరోజకళ్ళలోకి లోతుగా మాసి బోర్డు ఫీలవుతూ సిగరెట్లు కాల్చుకోడానికి (దానికీ అప్పు దొరకదు గదా) వీలుండదు. అలాగే అప్పడు అప్పులిచ్చే వాళ్ళ

వ్వలేరు, పుచ్చుకునేవాళ్ళు పుచ్చుకోలేరు. చివరికి ఈ విధంగా దేశంలో ఆర్థిక వ్యవస్థ అంతా స్తంభించిపోతుంది. ఇదంతా దేనివల్లటా! గుర్నాధం ఒక మొహమాటస్థుడికి పాతిక సర్దడం కోసమని. ఒక్కడుగు—ఒక్కటంటే ఒక్కటే అడుగుస్మీ—ఆ ఒక్కడుగూ వెయ్యవలసి రాలేకపోవడంవల్ల. ఆ అడుగు వేసి ఇంటో ఇనప్పెట్లోంచి డబ్బు తెచ్చేదాకా అప్పారావు కనక ఆ పాతికా గుర్నాధానికిస్తే—తన జేబులో వున్న పాతికా ఒక్క నిముషం సేపు గుర్నాధం అజమాయిషీకింద అతని ఇలాకాలో ఉంచితే?—ఏమీలేదు—లోకం అంతా ప్రశాంతంగా ఉంటుంది. కోకిలలు కూస్తాయి, పువ్వులు పూస్తాయి. అప్పులడిగే వాళ్ళు అడుగుతారు, ఇచ్చేవాళ్ళిస్తారు. ఇవ్వని వాళ్ళూ ఇస్తారు-సరిగ్గా అడిగితే. పరువులు యెక్కడికీపోవు. ఉన్నచోట తిష్టవేసుకూర్చుని, సత్యాగ్రహం చేసేవాళ్ళలా ఛస్తే కదలం అంటాయి. కొంపలు కూలనే కూలవు సరికదా కాలరెత్తుకు మరీ నిలబడతాయి పొగరుగా. కులగిరులూ అంతే, అప్పారావుకి వెయ్యి రూ.లు అప్పిస్తా నన్న గుర్నాధం ప్రజలా చలనం లేకుండా అలా నిలబడతాయి. ఇదంతా దేనివల్ల? అప్పారావు జేబులో పాతిక రూపాయల్నీ పిలకట్టుకు ఇవతలికి లాగి-ఇదుగో మిమ్మల్నే-వీరు గుర్నాధంగారు. ఒక ఐదు నిముషాలసేపు వీరి చేతులోకెళ్ళి వారు చెప్పినట్టు చెయ్యండి. ఎక్కడికి పొమ్మంటే అక్కడికి పొండి తరవాత ఆయనే మళ్ళీ పంపించేస్తాడు. నా దగ్గరకే వద్దురు గాని. బెంగెట్టుకోకండి. మరేం ఫర్వాలేదు, ధైర్యమేజయము, సత్యమే జయించును. ధర్మరాజు శాంతమూర్తి, నకులుడు, సహదేవుడు, అర్జునుడు, హా భీమ్మడు పొండి. అంటూ వాటికి నీతిచెప్పి గుర్నాధానికి ఒప్పగించటం వల్ల ఇంత లోకకళ్యాణమూ ఫెళ్ళుమంటూ జరుగుతుంది. కాదనడానికి

మధ్యన అప్పారావు ఎవడు ? బోడి అప్పారావు. అంచేత అప్పారావు సాహసించి, త్యాగంచేసి నిస్వార్ధంగా ఆ డబ్బుని గుర్నాధానికిచ్చాడన్న మాట. ఏమిటిచ్చాడు? అప్పు. అప్పనగానేమి? మనచేతిలో పాతిక రూపాయల్ని కాసేపు గుర్నాధాన్ని పట్టుకోనివ్వడం ! అంతే. రేపు గుర్నాధం పెట్లో వెయ్యిరూపాయల్ని వాళ్ళ నాన్నతో చెప్పే-కాసేపు-మహా ఐతే ఓ రెణ్నెల్లు-డబ్బు చేతికందితే ఒకపూట చాలు-అప్పారావుని పట్టుకోనివ్వడం. అంతే, అప్పనగా ఇది. అప్పారావనగా నెవరు? దేశ సేవచేసి ఇందాకటి పరువూ, కొంపా, కులగిరులూ పగ్గైరాలను కాపాడే మహదవకాశమ్ మారు వేషంలో అప్పారావై వచ్చి గుర్నాధం యెదుట నిలబడింది.

హిండూ థింకర్సు అన్నదదే. హిండూ ఫిలాసఫీ, హోల్ హిండూ థాట్, ఒక హిండూథాటే ఏమిటి హోల్ వరల్డు థాట్ అంతా కూడా గొంతు చించుకుని అన్ని భాషల్లోను ఘోష పెడుతున్నది ఇదే. అబ్బీ అప్పారావు నిన్ను గినక అప్పడిగితే వాణ్ణి ఉద్ధరించడం అనుకోకు. అప్పిచ్చే ఛాన్సును, అవకాశాన్ని, అదృష్టాన్ని ఇంతమంది సామాన్య జనులలోనూ నీకే ఇవ్వాలని, నిన్నే ఎన్నికచేసి ఎడ్రసు కనుక్కుని వెతుక్కుని వచ్చిన మహనీయుడని తెలుసుకో. వాడిని చూసి ఆనందపడి పొంగిపో. స్వామీ తమకు ఎంత అప్పు ఇచ్చే మహదవకాశాన్ని నాకు ప్రసాదిస్తున్నారు. నేను బహుయోగ్యుణ్ణి అనీ, నేను అప్పిచ్చి మళ్ళీ యెన్నాళ్ళకీ అడగననీ లోకం కోడై కూస్తుంది. కాన కటాక్షించి నాకు కొంచెం పెద్దకోటా ఇచ్చి అప్పు ఎక్కువ తీసుకోవలసిందని వేడుకుంటున్నాను అని ప్రాధేయపడి మరీ ఇవ్వాలి. అయితే గుర్నాధం అలా అన్నప్పటికీ అప్పారావు పుచ్చుకుంటాడా? కోడు. గుర్నాధం మీద ఎంత

ప్రేమ, అభిమానం ఉన్నా అప్పారావుకు పక్షపాతం లేదు. నీ కోటా వెయ్యి రూ.లు. దాటనివ్వను. ఇంకోసారి చూదాం అని కరక్టుగా వెయ్యి రూ. లే. (చిల్లర ఖర్చుకి ఐదు రూపాయలు కాక) పుచ్చుకుని పొమ్మంటాడు. మళ్ళా ఎప్పుడిస్తాడు ? ఏమో గుర్నాథం ఇట్నించి నోట్లు లెక్కపెట్టి వంద, రెండొందలూ, మూడూ, నాలుగూ అంటూ ఉండగానే, మరోపక్కనించి అప్పారావు ఆ అప్పును తీర్చి పారేస్తూ ఉండవచ్చు. లేదా రావలసిన డబ్బు సకాలంలో రాకపోతే వారం పదిరోజులో, నెలా రెణ్నెల్లో పట్టచ్చు. తరవాత ఆ డబ్బు తిరిగిచ్చి నాయనా దీన్ని యింకోడికి అప్పిచ్చి సద్వినియోగం చెయ్యాలని దీవించవచ్చు. అందువల్ల గుర్నాథం ఈ అపూర్వావకాశాన్ని చేజారవిడుచుకోక తప్పకుండా వాళ్ళ నాన్ననడిగి వెయ్యి సర్దేస్తే రక్షించినవాడవుతాడు. అప్పారావు గుర్నాథం మేలు జన్మజన్మలకీ జ్ఞాపకం చేసుకుంటాడు; ఋణం ఈ జన్మకి తీర్చలేడు. చర్మం చెప్పులు కుట్టించడానికి అభ్యంతరం లేదు కాని బాగుండదు. జోళ్ళు పల్చగా వస్తాయి. అంతకన్న గవర్నమెంటువాళ్ళు చేయిస్తున్న జోళ్ళు చాలా మంచివి. మన్నును. చౌకను.

పోతే అప్పు సంగతి. గుర్నాథం కనక రేపు తెల్లారి యేడున్నరకి, రొక్కం జతపరచకపోతే, అప్పారావు శివాలయం గుమ్మం దగ్గిర్నుంచి సరాసరి పొరుగులోకం, ఏ కైలాసమో పోయి అక్కడ, అప్పు వెతుక్కోవలసి వస్తుంది. లేదా కోవెల అసింటా కూర్చున్న స్వామీ ఋణానందతో కలిసి ఋషీకేశం లేచిపోవలసి వస్తుంది. సన్యాసంకూడా ఆత్మహత్యే నన్నారు పెద్దలు మరి. కాబట్టి గుర్నాథం ఈముక్క మనసులో ఉంచుకుని

మరీ వాళ్ళ నాన్నని ఒప్పించడం మంచిది. అని ఋణధీరుడు డా॥ అప్పా రావు క్రితంరోజు రాత్రి శివాలయం దగ్గర గుర్నాధానికి ఋణహృదయం విశదం చేశాడు.

ఆ ముక్కే మనసులో ఉంచుకుని వో మూల తనకీ అనుమానం పీకుతున్నా తండ్రి ఎదటపడి నసుగుతూ నిలబడ్డాడు గుర్నాధం మర్నాడు ఉదయం. అని సుబ్బన్న కథ ఆపి కడుపారా గాలి భోంచేసి బుస్సున తేన్చాడు.

ఇంతకీ యెవరీ అప్పారావు. ఆ పిల్లాడు వీడికి అప్పిచ్చేశాడా? అన్నాడు చీమల సింహాద్రి కుతూహలంతో.

సరిగ్గా ఈ ప్రశ్నే మునసబుగారు అడిగారు.

అబ్బాయ్ యెవరోయ్ ఈ అప్పారావు. నీ కెలాటి స్నేహం యిత నితో. ఇంత డబ్బు నమ్మి యివ్వవచ్చునా? నా యెదట పడి అడగడేం అన్నారు.

అప్పారావు నాకు మెడ్రాసులో స్నేహం అయాడు నాన్నా అన్నాడు గుర్నాధం.

ఎంత స్నేహం అయితేమటుకు యిలా స్వగ్రామాల దాకా తరివి తరివి అప్పులడుగుతారుటోయ్—ఇదెక్కడి స్నేహం అన్నాడు మునసబు గారు ఆలోచించి.

గుర్నాధం మందహాసం చేశాడు.